సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

ఆదివారం । 27 । ఏప్రిల్ । 2025

I



ఒత్తిడి.. పనిభారం

మహిళలని చూడకుండా అర్ధరాత్రి వరకు డ్యూటీలు వేస్తూ అధికారులు వేధిస్తున్నారని ఆర్టీసీ ఉద్యోగినుల్లో సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.

- IIలో▸



డిగ్రీ పరీక్షలు మళ్లీ వాయిదా..

ఈనెల 28నుంచి ప్రారంభం కానున్న కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ పరీక్షలను యూనివర్సిటీ అధికారులు శనివారం మళ్లీ వాయిదా వేశారు.

- IIలో▸



వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచే ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు వడగాలులు వీస్తాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.



నాడు పిడికిలెత్తి.. నేడు ఉరకలెత్తి

ఉద్యమ స్ఫూర్తితో ఓరుగల్లులో రజతోత్సవ సంబురం

- కాకతీయుల గడ్డపై స్వరాష్ట్ర సాధన ఉద్యమం
- ఉద్యమ పార్టీగా ఆదరణ 25 ఏళ్లలో ఎన్నో ఒడిదొడుకులు
- తెలంగాణ సాధనలో వరంగల్‌దే కీలక భూమిక

చాకలి ఐలమ్మ పౌరుషం.. రాణి రుద్రమ వారసత్వం.. భూపతి కృష్ణమూర్తి పోరాట పటిమ. బత్తిని మొగిలయ్య అమరత్వం. జయశంకర్ సార్ మేధస్సు. కణకణమండిన కాళోజీ రచనల ఉద్వేగం. వీరందరి స్ఫూర్తితో నాడు ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమం ఉవ్వెత్తున ఎగసింది. ఈ గడ్డపై నుంచి ఏ కార్యం మొదలు పెట్టినా విజయవంత మవుతుందన్న కేసీఆర్ నమ్మకంతో నేడు పార్టీ 25 ఏళ్ల వేడుకను ఇక్కడ నిర్వహిస్తున్నారు.

- IVలో▸ - సాక్షిప్రతినిధి, వరంగల్



కాంగ్రెస్ ఇక ఖతమే!

- ప్రభుత్వ మోసాలు ప్రజలకు తెలిసిపోయినయ్..
- రజతోత్సవ సభకు భారీగా తరలిరావాలి
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు

- IVలో▸

న్యూస్‌రీల్

ఫిట్ సెక్రటరీగా దాసరి శ్రీనివాస్



భూపాలపల్లి అర్బన్: ఏరియా వర్క్‌షాపు ఏఐటీయూసీ ఫిట్ సెక్రటరీగా దాసరి శ్రీనివాస్‌ను నియమించినట్లు బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్ తెలిపారు. ఏరియాలోని యూనియన్ కార్యాలయంలో శనివారం ఫిట్ కమిటీ ఎన్నిక నిర్వహించారు. అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ అబ్దుల్ ఖాదర్, ఎలక్ట్రిషన్ సేఫ్టీ కమిటీ సభ్యులుగా జి.కొమురయ్య, రమేష్, పిల్లి రవి, వర్క్ కమిటీగా కరుణాకర్, శ్రీనివాస్, గరిగ రమేష్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు శ్రీనివాస్, విజేందర్, రవికుమార్ పాల్గొన్నారు.

ఫార్మసిస్టుల హర్షం

భూపాలపల్లి అర్బన్: వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఫార్మసిస్టుల హోదాను ఫార్మసీ ఆఫీసర్స్‌గా మార్చడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు ఫార్మసీ కౌన్సిల్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు ఉప్పు భాస్కర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైద్య విద్య, డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్, వైద్య విధాన పరిషత్‌లో పనిచేస్తున్న ఫార్మసిస్టు గ్రేడ్–2లను ఫార్మసీ ఆఫీసర్స్‌గా, ఫార్మసిస్టు గ్రేడ్–1లను సీనియర్ ఫార్మసీ ఆఫీసర్స్‌గా, ఫార్మసీ సూపర్‌వైజర్లను చీఫ్ ఫార్మసీ ఆఫీసర్స్‌గా మార్పు చేస్తూ ఈ నెల 25వ తేదీన జీఓ జారీ చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా సీఎం, వైద్యారోగ్యశాఖ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

వృత్తి విద్య కోర్సులకు శిక్షణ

భూపాలపల్లి అర్బన్: జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు వృత్తి విద్య కోర్సులలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఏరియా సింగరేణి అధికార ప్రతినిధి మారుతి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డ్రైవాల్ అండ్ ఫాల్స్ సీలింగ్ టెక్నిషియన్, వెల్డింగ్ అండ్ ఫ్యాబ్రికేషన్ టెక్నిషియన్, ఆటోమొబైల్ అండ్ టూ వీలర్స్, ఎక్స్‌కవేటర్ ఆపరేటర్, ఫుడ్ బెవరేజీస్ అసిస్టెంట్, గెస్ట్ సర్వీస్ అసోసియేట్ హోటల్ మేనేజ్‌మెంట్, ఆఫీసర్ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్, ఫీల్డ్ టెక్నిషియన్ కోర్సులలో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. మూడు నెలల శిక్షణ, భోజన వసతి సదుపాయం, నిపుణుల ద్వారా సాఫ్ట్ స్కిల్ శిక్షణ, శిక్షణ పొందిన అనంతరం ఇండస్ట్రీ గుర్తింపు పొందిన సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు తెలిపారు. అడ్మిషన్ కోసం సంబంధిత కోర్సులో విద్యార్హత ధృవీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, రేషన్ కార్డు, కుల ధృవీకరణ పత్రాలు అందించాలని సూచించారు. ఆసక్తి, అర్హత గల వారు ఏరియాలోని ఎంవీటీసీ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

సర్వే పనుల అడ్డగింత



మొగుళ్లపల్లి: మండలకేంద్రంలో నేషనల్ హైవే రోడ్డు సర్వే పనులను రైతులు శనివారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ భూములు కోల్పోతున్న తమకు సరైన న్యాయం జరగకపోతే సర్వే పనులను ముందుకు సాగనివ్వమని రైతులు ఆర్డీఓ రవికి మొరపెట్టుకున్నారు. సర్వే పనులకు రైతులు సహకరించాలని ఆర్డీఓ కోరారు. తమ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని రైతులు తెలిపారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ సునీత, ఆర్ఐ శివరామ కృష్ణ, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

మే మొదటివారంలో ట్రస్టుబోర్డు?

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం దేవస్థానం ట్రస్టుబోర్డు (పాలక వర్గం) నియామకానికి మే మొదటి వారంలోగా ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రానున్నట్లు తెలిసింది. మే 15నుంచి 26వరకు సరస్వతి నది పుష్కరాలు జరగనున్న నేపథ్యంతో ట్రస్టుబోర్డు నియామకం కోసం ప్రభుత్వం ప్లాన్ చేస్తున్నట్లు తెలిసింది. ట్రస్టుబోర్డు కోసం జనవరి 6న దేవాదాయశాఖ నోటిఫికేషన్ వేసిన విషయం తెలిసిందే. దీంతో వివిధ ప్రాంతాల వారు ట్రస్టుబోర్డు డైరెక్టర్ల కోసం 86కు పైగా దరఖాస్తులు సంబంధిత కార్యాలయంలో చేసుకున్నారు. అందులో ధృవీకరణ పత్రాలు, పోలీసు కేసులు, ఇతర వ్యవహారాలు, వివరాలు సరిగ్గా లేని వారిని స్క్రూటినీలో తీసివేశారు. అన్ని సరిగ్గా ఉన్న 41మందిలో నుంచి 14మందిని డైరెక్టర్ల కోసం మంత్రి శ్రీధర్‌బాబు ఎంపికచేసి దేవాదాయశాఖకు లేఖ పంపించనున్నట్లు సమాచారం. ట్రస్టుబోర్డులో ఎక్స్ అఫీషియో(అర్చక)తో 15మంది డైరెక్టర్లు కాగా అందులో ఒక్కరిని చైర్మన్‌గా ఎన్నుకోనున్నారు. ఇప్పటికే ఆశావహులు మంత్రి శ్రీధర్‌బాబు ఇతర నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మంథనికి చెందిన కాళేశ్వరం దేవస్థానం మాజీ చైర్మన్ అవధాని మోహన్‌శర్మకు పదవి వరించే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది.

దారులన్నీ ఎల్కతుర్తి వైపే!



500మంది అతిథులు కూర్చునేలా తీర్చిదిద్దిన సభావేదిక, ఎల్కతుర్తి ఎక్స్ రోడ్డులో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలకు సిద్ధమైన సభాస్థలి

నేడు చింతలపల్లిలో బీఆర్ఎస్ రజతోత్సవం

- పాతికేళ్ల పండుగకు తరలుతున్న జనం
- ఉమ్మడి వరంగల్ టార్గెట్ 2.50 లక్షల మంది
- జన సమీకరణలో నాయకుల తలమునకలు
- సాయంత్రం 4.30 గంటలలోపు సభకు చేరేలా ప్లాన్
- 5.30 గంటల సమయంలో వేదికపైకి అధినేత కేసీఆర్

సాక్షిప్రతినిధి, వరంగల్:

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం చింతలపల్లిలో నేడు (ఆదివారం) నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాష్ట్ర నలుమూలల నుంచి జనాలను సమీకరించే పనిలో నాయకులు తలమునకలయ్యారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహించే సిల్వర్ జూబ్లీ వేడుకలకు 10 లక్షల మంది వస్తారని పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. రాష్ట్ర నలుమూలల నుంచి జనాలను సభకు తరలించేందుకు వాహన సౌకర్యం కూడా కల్పించారు. ఆదివారం సాయంత్రం 4:30 గంటలలోపు సభా ప్రాంగణానికి చేరుకునేలా నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. టీఆర్ఎస్ ఏర్పడి 24 ఏళ్లు పూర్తయి 25వ ఏట అడుగుపెడుతున్న నేపథ్యంలో.. రజతోత్సవం పార్టీకి ప్రతిష్టాత్మకంగా మారింది. దేశవ్యాప్తంగా ఆసక్తికరంగా మారిన ఈ సభను ఎల్కతుర్తిలో నిర్వహించడం చర్చనీయాంశం కాగా.. దారులన్నీ ఎల్కతుర్తి వైపే కదులుతున్నాయి.

బాహుబలి వేదిక.. తరలివస్తున్న జనం

గులాబీ పార్టీ పాతికేళ్ల పండుగకు ఎల్కతుర్తి చూడముచ్చటగా ముస్తాబైంది. చరిత్రలో నిలిచేలా నిర్వహించే ఈవేడుకల కోసం ఎల్కతుర్తి ఎక్స్ రోడ్డులో బాహుబలి సభావేదిక రెడీ అయ్యింది. రజతోత్సవానికి అధినాయకత్వం ఎంచుకున్న ఎల్కతుర్తి ఎక్స్‌రోడ్డు సమీపంలో వేదిక నయనానందంగా రూపుదిద్దుకుంది. ఇందుకోసం పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పర్యవేక్షణలో 1,213 ఎకరాలను రైతుల నుంచి సమీకరించిన గులాబీ శ్రేణులు సుమారు నెల రోజులుగా శ్రమించారు. సుమారు పది లక్షల మంది హాజరయ్యే ఈ వేడుకకు కేసీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.



సభావేదిక ఏర్పాట్లలో ఆ ఆరుగురు..

గులాబీ దళపతి, పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాలు, సూచనలు, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యవేక్షణలో ఆరుగురు నేతలు ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, బీఆర్ఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ గ్యాదరి బాలమల్లు, మాజీ ఎమ్మెల్యేలు వినయ్‌భాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, వొడితెల సతీశ్‌కుమార్ అవిశ్రాంతంగా శ్రమించారు. ఎల్కతుర్తి, శివారు గ్రామాల రైతుల నుంచి భూముల హామీ పత్రాల స్వీకరణ మొదలు.. సభావేదిక ఏర్పాటు వరకు అధినేత ఆదేశాల మేరకు పని చేశారు.

పోలీసుల భారీ బందోబస్తు

ఎల్కతుర్తి: సభకు పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. వరంగల్ సీపీ సన్‌ప్రీత్‌సింగ్ ఇదివరకే సభా ప్రాంగణాన్ని పరిశీలించి నిర్వాహకులతో చర్చించారు. సభలో ఎలాంటి అవాంతరాలు, ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా భారీగా పోలీసులను నియమించారు. ఇద్దరు డీసీపీలు, మరో ఇద్దరు అడిషనల్ డీసీపీలు, ఎనిమిది మంది ఏసీపీలు, 28 మంది సీఐలు, 66 మంది ఎస్సైలు, 137 మంది ఏఎస్సైలు, హెడ్‌కానిస్టేబుళ్లు, 511 మంది కానిస్టేబుళ్లు, 200 మంది హోంగార్డులతోపాటు మిగతా డిస్ట్రిక్ట్ గార్డ్స్‌ను నియమించారు. మొత్తం 1,100 మందికిపైగా పోలీసులను కేటాయించారు. హెలిపాడ్, సభా ప్రాంగణం, పార్కింగ్ స్థలాలు, ట్రాఫిక్ క్రౌడ్ కంట్రోలింగ్ తదితర ప్రాంతాల్లో సేవలందించనున్నారు.

గంటకుపైగా ప్రసంగించనున్న కేసీఆర్



హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరనున్న అధినేత కేసీఆర్ నేరుగా సభావేదికకు సుమారు 500 మీటర్ల దూరంలో ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్ద దిగుతారు. సుమారు 5.30 గంటల సమయంలో వేదికపైకి చేరుకునే అవకాశం ఉంది. వేదికపై ఆయన సుమారు గంటకుపైగా ప్రసంగించే అవకాశం ఉందని పార్టీవర్గాల సమాచారం.

ఎల్కతుర్తి జంక్షన్‌లో ఏర్పాటు చేసిన కేసీఆర్ కటౌట్, బ్యానర్లు



గులాబీమయం

రజతోత్సవ సభతో ఎల్కతుర్తి గులాబీమయమైంది. బీఆర్ఎస్ మహాసభతో ఎల్కతుర్తి రజతోత్సవ శోభను సంతరించుకుంది. పార్టీ అధినేత కేసీఆర్, ఇతర నాయకుల కటౌట్లు, ఫ్లెక్సీలు, బ్యానర్లు, గులాబీ తోరణాలతో కళకళలాడుతోంది. పెద్ద వేదిక.. ఆ పక్కనే కళాకారుల ఆట–పాటల కోసం ప్రత్యేకంగా మరో వేదిక ఆకర్షణీయంగా కనిపిస్తోంది. రాష్ట్రనలుమూలల నుంచి వచ్చే వాహనాల కోసం 1,059 ఎకరాల్లో పార్కింగ్ ఇవ్వగా.. వీవీఐపీ వాహనాల కోసం సభావేదిక ఎడమ భాగం, వెనుక భాగంలో పార్కింగ్‌ను ఏర్పాటు చేశారు. మహాసభ ప్రాంగణంలో వాహనాలు, ప్రజలు వచ్చేందుకు వీలుగా ఏర్పాటు చేసిన గ్రీన్, రెడ్ కార్పెట్లు ఆకట్టుకునేలా ఉన్నాయి.



ఆరు రోజులు.. 110 కిలోమీటర్లు

రజతోత్సవ సభాస్థలి సమీపానికి చేరిన సూర్యాపేట ఎడ్లబండ్లు

ఎల్కతుర్తి క్రాస్ వద్ద ఆదివారం జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు సూర్యాపేట జిల్లా నుంచి బయల్దేరిన ఎడ్లబండ్లలో పార్టీ శ్రేణులు ఆరు రోజుల పాటు ప్రయాణించి శనివారం సాయంత్రానికి సభాస్థలి సమీపానికి చేరుకున్నారు. ఆదివారం ఉదయం సభకు వెళ్లనున్నారు. ఈనెల 22వ తేదీన సూర్యాపేట జిల్లా ఆత్మకూరు.ఎస్ మండలం నుంచి బయల్దేరిన ఎడ్లబండ్ల ర్యాలీని దండుమైసమ్మ ఆలయం వద్ద మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధి అయిన దంతాలపల్లినుంచి తొర్రూరు, రాయపర్తి, వర్ధన్నపేట మీదుగా శనివారం మధ్యాహ్నం నాటికి వరంగల్ నగరానికి చేరుకుంది. ఆయాచోట్ల బీఆర్ఎస్ నాయకులు ర్యాలీకి ఘనస్వాగతం పలుకుతూ వచ్చారు. వారికి అవసరమైన ఆహారం, పశువులకు దాణా అందించారు. శ్రేణులు సాయంత్రానికి సభాస్థలి సమీపంలోని హసన్‌పర్తి శివారులో బస చేశారు. మొత్తం ఆరు రోజులపాటు 110 కిలోమీటర్లు ప్రయాణించారు. - వరంగల్ డెస్క్

భూ భారతితో భూ వివాదాలు పరిష్కారం

- కలెక్టర్ రాహుల్‌శర్మ

కాటారం/మల్హర్: భూ భారతి చట్టంతో భూ సమస్యలు సత్వర పరిష్కారానికి నోచుకుంటాయని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. మహాముత్తారం మండలం బోర్లగూడెం, మల్హర్ మండలం కొయ్యూరులో శనివారం భూ భారతి చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ భూమి కలిగిన ప్రతి రైతుకు భూధార్ కార్డు జారీ చేయనున్నట్లు తెలిపారు. ప్రతి అంశం భూ భారతి పోర్టల్‌లో ఉంటుందని భూములకు సంబంధించిన వివరాలను ఎవరికి వారు పరిశీలించుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా రైతులు, భూ యజమానులు అడిగిన పలు సందేహాలను కలెక్టర్ స్వయంగా నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు, తహసీల్దార్ రవికుమార్, పీఏసీఎస్ చైర్మన్ మొండయ్య తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

పలిమెలలో వాలీబాల్ టోర్నమెంట్

- ఎస్పీ కిరణ్ ఖరే



భూపాలపల్లి: ఈ నెల 28వ తేదీ నుంచి పలిమెల మండలంలో పోలీస్ ప్రజా భరోసా వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఎస్పీ కిరణ్ ఖరే శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడు రోజుల పాటు ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల భూపాలపల్లి, ములుగు జిల్లాలతో పాటు రాష్ట్ర సరిహద్దులో గల ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్, మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొనవచ్చని తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి కింద రూ.25వేలు, రెండవ బహుమతి రూ.15వేలు, మూడవ బహుమతి రూ.10వేలతో పాటు ట్రోఫీలు బహుకరిస్తామన్నారు. టోర్నమెంట్‌కు ఎంట్రీ ఫీజు లేదన్నారు. క్రీడాకారులకు భోజన వసతి, దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి వసతి సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. మరిన్ని వివరాల కోసం 73961 47071, 73069 07549 ఫోన్ నంబర్లను సంప్రదించాలని ఎస్పీ వెల్లడించారు.

శనిత్రయోదశికి భక్తుల రద్దీ

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వర ముక్తీశ్వరస్వామి దేవస్థానం అనుబంధ దేవాలయం నవగ్రహాల వద్ద శని త్రయోదశి సందర్భంగా భక్తుల రద్దీ నెలకొంది. శనివారం రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలి వచ్చి ముందుగా త్రివేణి సంగమ గోదావరిలో పుణ్యస్నానాలు చేసి అనంతరం నవగ్రహాల వద్ద శనిపూజలను సామూహికంగా నిర్వహించారు. నవగ్రహాలకు నైవేద్యం సమర్పించారు. తరువాత స్వామివారి గర్భగుడిలో ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. శ్రీశుభానందదేవి అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఒక్క రోజు ఆలయానికి రూ.3.61లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు.

భరోసా నింపని ఉపాధి..


మూడు నెలలుగా కూలీలకు అందని డబ్బులు

- మంజూరుకు నోచుకోని నూతన జాబ్‌కార్డులు
- ఆందోళనలో ఉపాధిహామీ కూలీలు

కాటారం: గ్రామాల్లో వలసలు నివారించి పేదలకు ఉన్న ఊరిలోనే పని చూపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన ఉపాధిహామీ పథకం నిరుపేద కూలీలకు భరోసా నింపడం లేదు. మూడేళ్లుగా వచ్చిన నూతన మార్పులతో పథకం నిర్వహణ అస్తవ్యస్తంగా మారిపోయింది. క్షేత్రస్థాయిలో పనులు చేసిన కూలీలకు రోజుల తరబడి వేతనాలు అందకపోవడంతో పాటు పనులకు వద్దామని అనుకునే అర్హులైన కూలీలకు జాబ్‌కార్డుల మంజూరు నిలిచిపోయింది. దీంతో ఇటు పనిచేసిన కూలీలు, అటు ఉపాధి పొందాలని అనుకునే కూలీలు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. నిబంధనల ప్రకారం పనులు నిర్వహించినప్పటికీ కూలీలకు కూలి గిట్టుబాటు అవడం లేదు. ఇలా అనేక లోటుపాట్లతో ఉపాధిహామీ పథకంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

మూడు నెలలుగా నిలిచిన ఉపాధి వేతనాలు..

జిల్లాలో 2.41లక్షల మంది కూలీలు ఉండగా.. 1.31లక్షల మంది కూలీలు పనులకు హాజరవుతున్నారు. జిల్లాలోని పలు మండలాల్లో ఉపాధిహామీ పనులు కొనసాగుతున్నాయి. ఉపాధిహామీ పథకంలో భాగంగా గ్రామాల్లోని రైతుల పొలాల్లో ఫాంపండ్‌ల నిర్మాణం, నర్సరీల నిర్వహణ, బ్యాగ్ ఫిల్లింగ్, మొక్కల సంరక్షణ చర్యల పనులను కూలీలు చేపడుతున్నారు. ఈ పనులకు సంబంధించి గత జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబంధించి కూలీలకు ఇప్పటివరకు కూలి డబ్బులు అందలేదు. ఒక్కో కూలీకి సగటున రూ.1500నుంచి రూ.2వేల వరకు కూలి డబ్బులు అందాల్సి ఉంది. కూలి డబ్బుల చెల్లింపు జాప్యంలో అధికారులకు సైతం పూర్తి సమాచారం లేదు. కూలీలకు వేతనాలు ఎప్పుడు జమ అవుతాయనే స్పష్టత కరువైంది. అసలే వేసవికాలం కావడంతో కూలీలు ఇతర పనులకు వెళ్లే అవకాశం లేకపోవడంతో ఉపాధి పనుల వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో కూలి డబ్బులు వస్తేనే వారి కుటుంబ పోషణ ముందుకు సాగుతోంది. రోజుల తరబడి కూలి డబ్బులు చేతికి రాక ఉపాధి కూలీలు తమ పూట గడుపుకోవడానికి నానా పాట్లు పడుతున్నారు. కొంతమంది కూలీల ఖాతాల్లో డబ్బులు జమ అయినట్లు అధికారులు చెప్పుకొస్తున్నప్పటికీ కూలీల నుంచి మాత్రం స్పష్టత రావడం లేదు.





ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

నూతన జాబ్‌కార్డుల ఊసే లేదు..



రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కారణంగా ఉపాధిహామీ పథకానికి ప్రాధాన్యత పెరిగిపోయింది. కనీసం 20రోజుల పనిదినాలు చేసి ఉండాలనే నిబంధనతో కూలీలు అధికంగా ఉపాధి పనులవైపు మొగ్గు చూపుతున్నారు. జాబ్‌కార్డు కలిగిన కుటుంబంలో ఒక్కరికే అవకాశం ఉండటంతో నూతన జాబ్‌కార్డులు, వేరుగా జాబ్‌కార్డుల కోసం దరఖాస్తులు చేసుకుంటున్నారు. కానీ ప్రభుత్వ ఆదేశాలతో కొంతకాలంగా జిల్లాలో నూతన జాబ్‌కార్డుల మంజూరు నిలిచిపోయింది. రెండేళ్ల క్రితం జాబ్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారికి సైతం ఇప్పటికీ జాబ్‌కార్డు మంజూరు కాలేదని సమాచారం. జాబ్ కార్డులో పేరు మార్పు, తొలగింపు లాంటి సవరణలకు సైతం అవకాశం లేకుండా పోయింది. దీంతో అర్హులైన నిరుపేద కూలీలు సైతం ఉపాధి పనులకు దూరమవుతున్నారు. ఇప్పటివరకు నూతన జాబ్ కార్డుల కోసం సుమారు 200పైచిలుకు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది.

త్వరలో ఖాతాల్లో జమ అవుతాయి

ఆర్థిక సంవత్సరం ప్రారంభం కావడంతో మూడు నెలలకు సంబంధించిన ఉపాధి కూలీల వేతనాలు నిలిచిపోయాయి. పనులు చేసిన కూలీల ఖాతాల్లో త్వరలోనే కూలి డబ్బులు జమవుతాయి. ఆందోళన చెందొద్దు. ప్రభుత్వ ఆదేశాలతో నూతన జాబ్ కార్డుల జారీ తాత్కాలికంగా నిలిచిపోయింది. అనుమతి రాగానే నూతన కార్డులు మంజూరు చేస్తాం.

- నరేశ్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి

క్లుప్తంగా

కాజీపేట మీదుగా వాస్కోడగామ ఎక్స్‌ప్రెస్

● మరికొన్ని రైళ్ల దారి మళ్లింపు

కాజీపేట రూరల్‌: కాజీపేట జంక్షన్ మీదుగా దక్షిణ మధ్య రైల్వే అధికారులు వాస్కోడగామ ఎక్స్‌ప్రెస్‌తోపాటు పలు రైళ్లను దారి మళ్లించి నడిపిస్తున్నట్లు శనివారం రైల్వే అధికారులు శనివారం తెలిపారు. పలు రూట్లలో నిర్వహిస్తున్న రైల్వే సాంకేతిక అభివృద్ధి పనుల నేపథ్యంలో కొన్ని రైళ్లను కాజీపేట మీదుగా నడిపిస్తున్నట్లు తెలిపారు. రైళ్ల వివరాలు.. మే 9వ తేదీన వాస్కోడగామ–జసిడి జంక్షన్ (17321) వెళ్లే ఎక్స్‌ప్రెస్, మే 12వ తేదీన జసిడి జంక్షన్–వాస్కోడగామ (17322) వెళ్లే ఎక్స్‌ప్రెస్‌ను వయా కాజీపేట జంక్షన్‌కు చేరుకొని వెళ్లనున్నట్లు అధికారులు తెలిపారు. ఏప్రిల్ 28వ తేదీన దానాపూర్–చర్లపల్లి (07648) వెళ్లే వీక్లి ఎక్స్‌ప్రెస్, ఏప్రిల్ 29వ తేదీన రక్సోల్–చర్లపల్లి (07052) వెళ్లే వీక్లి ఎక్స్‌ప్రెస్, ఏప్రిల్ 29వ తేదీన ముజఫర్‌పూర్ జంక్షన్–చర్లపల్లి (05293) వెళ్లే ఎక్స్‌ప్రెస్, మే 1వ తేదీన చర్లపల్లి–ముజఫర్‌పూర్ (05294) ఎక్స్‌ప్రెస్ కాజీపేట జంక్షన్‌కు చేరుకొని వెళ్లనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

వడదెబ్బతో ట్రాలీ డ్రైవర్ మృతి


చంద్రమౌళి (ఫైల్)

కమలాపూర్‌: మండలంలోని ఉప్పల్‌కు చెందిన కొయ్యడ చంద్రమౌళి (45) అనే ట్రాలీ ఆటో యజమాని, డ్రైవర్ వడదెబ్బతో శనివారం మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ట్రాలీ ఆటో నడుపుతూ జీవనం సాగించే చంద్రమౌళి శనివారం వ్యవసాయ కూలీలను తీసుకొచ్చేందుకు వెళ్తున్న క్రమంలో ఎండ తీవ్రతకు తాళలేక వడదెబ్బకు గురయ్యాడు. ఈ క్రమంలోనే దేశరాజుపల్లి చెరువు కట్టపై చెట్టు నీడన ట్రాలీ ఆటోను నిలిపి సేదదీరుతుండగా వడదెబ్బతో ట్రాలీ ఆటోలోనే మృతి చెందాడు. గమనించిన స్థానికులు 108కు సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. చంద్రమౌళికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.



ఒత్తిడి.. పనిభారం

ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సు మహిళా కండక్టర్ల ఆవేదన



- నిర్ణీత సమయానికి మించి విధులు..
- రాత్రి అవుతుండడంతో కరువైన భద్రత
- ఆలస్యంగా ఇంటికి వెళ్తుండడంతో కుటుంబంలో విభేదాలు


ఎలక్ట్రిక్ బస్సులు

వరంగల్ నగరంలోని గోపాల్‌పూర్‌కు చెందిన ఓ మహిళా కండక్టర్ (పేరు చెప్పడానికి ఇష్టపడడం లేదు) రాత్రి 8 గంటల వరకు నిర్వహించాల్సిన విధులు రాత్రి 12.30 వరకు డ్యూటీ చేయాల్సి వస్తోంది. ఆ సమయానికి తమ రూట్‌లో బస్సులుండవు. ఆటోలు కూడా చాలా అరుదు. చివరికి ఏదైనా ఆటో దొరికితే ఆలస్యంగా ఇంటికి వెళ్లడంతో కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. 'పనిభారం ఎక్కువైంది. మానసికంగా ప్రశాంతంగా ఉండలేక పోతున్నా' అంటూ ఆ కండక్టర్ కన్నీటి పర్యంతమవుతోంది.

హన్మకొండ: ఆర్టీసీ యాజమాన్యం.. మహిళా కండక్టర్ల భద్రతను గాలికి వదిలేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉదయాన్నే పిల్లలను వదిలేసి విధులకు వచ్చిన వారు.. రాత్రి ఆలస్యంగా ఇంటికి వెళ్తే .. ఇంత అర్ధరాత్రి డ్యూటీ ఏంటని భార్యాభర్తల మధ్య విబేధాలు వస్తుండడంతో తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. కుటుంబానికి ఆర్థిక ఆసరా ఉంటామని ఉద్యోగం చేస్తుంటే కాపురాలు కూలిపోయే పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహిళలని చూడకుండా అర్ధరాత్రి వరకు డ్యూటీలు వేస్తూ అధికారులు వేధిస్తున్నారని ఉద్యోగుల్లో సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.

కనిపించని సమయపాలన

నిబంధనల మేరకు ఉదయం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు మాత్రమే మహిళా కండక్టర్లు విధులు నిర్వహించాలి. కానీ, వరంగల్ రీజియన్‌లోని వరంగల్–2 డిపోలో రాత్రి 12 నుంచి ఒంటి గంట వరకు డ్యూటీలు చేయాల్సి వస్తోందని మహిళా కండక్టర్లు వాపోతున్నారు. ఎలక్ట్రిక్ బస్సుల రాకతో ఈసమస్య తారాస్థాయికి చేరింది. చార్జింగ్ పేరుతో 2 గంటలకు పైగా సమయాన్ని వృథాగా గడపాల్సి వస్తోంది. ఆ రెండు గంటలు అదనంగా విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. ఈ విషయమై మహిళా ఉద్యోగుల్లో తీవ్రఅసహనం వ్యక్తమవుతోంది.

సమయం వృథా..

టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం వరంగల్ రీజియన్‌కు మొత్తం 112 ఎలక్ట్రిక్ బస్సులు కేటాయించింది. వీటి నిర్వహణ బాధ్యతలు జేబీఎం ఎకోలైఫ్ సంస్థ చూసుకుంటుంది. 107 బస్సులు రోడ్లపై పరుగులు పెడుతుండగా.. మిగతావి అత్యవసర సమయాల్లో వాడేందుకు డిపోల్లో నిలిపి ఉంచుతారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా.. ఈ బస్సులు ఒక సారి చార్జ్ చేస్తే 250 కిలోమీటర్లు తిరుగుతాయి. బస్‌లో పరిమితికి మించి ప్రయాణికులు ఎక్కినా.. డ్రైవింగ్‌లో తేడా ఉన్నా.. చార్జింగ్ త్వరగా దిగిపోతుందని జేబీఎం ఉద్యోగులు చెబుతున్నారు. ఒక్క ట్రిప్పు వెళ్లి రాగానే డిపోలో చార్జింగ్ చేసుకోవాలి. చార్జింగ్ పెట్టిన ప్రతీసారి 2 గంటల సమయం పడుతుంది. చార్జింగ్ ఎక్కే వరకు కండక్టర్లు వేచి ఉండాలి. దీంతో అదనంగా మరో రెండు గంటలు విధులు నిర్వహించాల్సి వస్తోంది. కాగా.. నిర్దేశించిన సమయాన్ని ఆర్టీసీ యాజమాన్యం డ్యూటీగా పరిగణించకపోవడం తగదని కార్మిక సంఘాలు పేర్కొంటున్నాయి. ఒక్కోసారి ఒక ట్రిప్పులో మధ్యలోనే చార్జింగ్ తగ్గిపోతుండడంతో సమీపంలోని డిపోలో చార్జింగ్ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నట్లు కండక్టర్లు చెబుతున్నారు. మరింత సమయం విధుల్లోనే గడుపాల్సి వస్తోందని వారు వాపోతున్నారు.

కుటుంబంలో కలహాలు..

చార్జింగ్ పేరిట అదనంగా విధులు నిర్వర్తించాల్సి వస్తుండడంతో ఇళ్లకు వెళ్లాక మహిళా ఉద్యోగులకు కుటుంబ సభ్యులు, భార్యాభర్తల మధ్య గొడవలవుతున్నాయని కార్మిక వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అర్ధరాత్రి డ్యూటీ దిగిన మహిళా కండక్టర్లు ఇంటికి చేరుకోవడానికి నానా తంటాలు పడుతున్నారని తెలిపారు. ఆ సమయంలో బస్సులు ఉండవని, ప్రైవేటు వాహనాల్లో ఇంటికి వెళ్తున్న క్రమంలో ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని కార్మిక సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. నిబంధనల మేరకు మహిళ కండక్టర్లకు రాత్రి 8 గంటల వరకు డ్యూటీ ముగిసేలా చూడాలని కార్మిక సంఘాలతో పాటు, మహిళా ఉద్యోగులు కోరుతున్నారు.

వరంగల్ రీజియన్‌లో ఇలా..

మొత్తం ఎలక్ట్రిక్ బస్సులు:	112
వీటిలో సూపర్ లగ్జరీ:	20
డీలక్స్:	22
ఎక్స్‌ప్రెస్:	70
మొత్తం మహిళా కండక్టర్లు:	99 మంది

(విడతల వారీగా విధులు)

త్వరలో చార్ట్ మారుస్తాం..

మహిళా ఉద్యోగులు సమయానికి డ్యూటీ ముగించుకునేలా చార్ట్ రూపొందించాలని నిర్ణయం తీసుకున్నాం. రెండో ట్రిప్పు వెళ్లడానికి చార్జింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. మహిళా కండక్టర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులు గమనించాం. వాటిని అధిగమించేందుకు చర్యలు తీసుకుంటాం.

– జ్యోత్స్న, మేనేజర్, వరంగల్–2 డిపో

ఎలక్ట్రిక్ బస్సుల డ్యూటీతో అనారోగ్యం పాలవుతున్నాం..

ఎలక్ట్రిల్ బస్సుల డ్యూటీలో అనారోగ్యం పాలవుతున్నాం. ఒక ట్రిప్పు వెళ్లి రాగానే బస్సుకు చార్జింగ్ పెడుతున్నారు. చార్జింగ్ కావడానికి రెండు గంటలు పడుతుంది. ఈ స్టాండింగ్ టైమ్ పేరుతో రెండు గంటలు ఎలాంటి పని లేకుండా వేచి చూడాల్సి వస్తోంది. దీంతో రెండు గంటలు ఆలస్యంగా డ్యూటీ దిగాల్సి వస్తోంది. దీంతో ఇంటిలో సమస్యలు నెలకొంటున్నాయి. తద్వారా మానసికంగా, శారీరకంగా ఒత్తిడికి గురై అనారోగ్యం పాలవుతున్నాం. ఈ రెండు గంటలు డ్యూటీ టైమ్‌లో లెక్కించడం లేదు.

– వెంకటమ్మ (పేరు మార్చాం) కండక్టర్

రామప్ప కార్వింగ్స్ బ్యూటిఫుల్


నందిని గుప్తాని ఆశీర్వదిస్తున్న అర్చకుడు


పొన్నచెట్టు శిల్పాన్ని మీటుతున్న నందిని గుప్తా

● మిస్ వరల్డ్ ఇండియా కంటెస్టెంట్ నందిని గుప్తా

వెంకటాపురం(ఎం): రామప్ప కార్వింగ్స్ బ్యూటిఫుల్ అంటూ మిస్ వరల్డ్ ఇండియా కంటెస్టెంట్ నందిని గుప్తా కొనియాడారు. శనివారం సాయంత్రం ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా టూరిజం అధికారి శివాజీ, టూరిజం కార్పొరేషన్ మార్కెటింగ్ మేనేజర్ శ్రీనివాసరావు ఆమెకు పూలమొక్క అందించి స్వాగతం పలికారు. రామప్ప ఆలయంలో ఫొటో షూట్ నిర్వహించిన అనంతరం రామప్ప రామలింగేశ్వరస్వామికి ఆమె పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్ ఆమెకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం అందించారు. టూరిజం గైడ్ విజయ్‌కుమార్ ద్వారా రామప్ప ఆలయ విశిష్టత తెలుసుకుంటూ రామప్పలోని ప్రతి శిల్పాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. సరిగమపదనిశ పొన్నచెట్టు శిల్పం, నీటిలో తేలాడే ఇటుకలను ఆసక్తిగా తిలకించారు. రామప్ప శిల్పకళా సంపద ధ్వంసం కావడానికి గల కారణాలను గైడ్‌ను అడిగి తెలుసుకున్నారు. మే 14న మిస్ వరల్డ్ కాంటెస్ట్ టీం సందర్శించనున్న నేపథ్యంలో రామప్ప ఆలయానికి వచ్చినట్లు పేర్కొన్నారు. మే 14 లోపు మరోసారి రామప్ప ఆలయాన్ని సందర్శిస్తానని ఆమె వెల్లడించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గిరిబాబు, ఎస్సై జక్కుల సతీష్, ఆర్‌ఐ విజేందర్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కర్రిగుట్టలో కాల్పులు నిలిపివేయాలి

● మావోయిస్టులతో ప్రభుత్వాలు చర్చలు జరపాలి
● పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్


మాట్లాడుతున్న లక్ష్మణ్, పక్కన ప్రొఫెసర్ హరగోపాల్

నయీంనగర్‌: ఛత్తీస్‌గఢ్ తెలంగాణ సరిహద్దులోని ఊసూరు కర్రిగుట్టలో కాల్పులు నిలిపివేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిస్టులతో చర్చలు జరపాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, రాష్ట్ర నేత ప్రొఫెసర్ హరగోపాల్ కోరారు. శనివారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ప్రజా సంఘాలు, పౌరహక్కుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి మధ్యభారతంలో ఆదివాసీల హననాన్ని ఆపివేయాలని కోరారు. ప్రజాస్వామ్య, రాజ్యాంగం అమలు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలన్నారు. బ్రిటీష్ కాలం నుంచి మావోయిస్టు పార్టీ ఉందని, ఆదివాసీలు బలవుతున్నారని అన్నారు. ఆదివాసీ ప్రజలు భయానక వాతావరణంలో ఉన్నారని, కేంద్రం శ్మశానంలో చర్చలు జరపాలని చూస్తోందని ఎద్దేవా చేశారు. మధ్యభారతంలో అపారమైనటువంటి ఖనిజ వనరులను దేశ, విదేశీ వాణిజ్య సామ్రాజ్యవాదులు కార్పొరేట్లతో ఒప్పందాలు చేసుకుని అందులో భాగంగా ఆదివాసులను వారికి అండగా ఉన్న మావోయిస్టులను అంతంచేసే కుట్ర జరుగుతోందన్నారు. ప్రభుత్వం రాజ్యాంగ సూత్రాలను ఉల్లంఘించి పాలన సాగిస్తోందన్నారు. సమాజ కోరిక మేరకు కేంద్రం ముందుకు రావాలని, ఏకపక్ష హననాన్ని దేశ ప్రజలు, ప్రజాస్వామికవాదులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు ఇన్నారెడ్డి, రవీందర్, తిరువతయ్య, కుమారస్వామి, ఎం.శంకర్, శాంతి, గంగాధర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

● వివరాలు వెల్లడించిన సీఐ మహేందర్‌రెడ్డి


వివరాలు వెల్లడిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి

పాలకుర్తి టౌన్‌: కొడకండ్ల మండలం రేగులతండాలో ఇటీవల జరిగిన హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. మండల కేంద్రంలోని సర్కిల్ కార్యాలయంలో సీఐ మహేందర్‌రెడ్డి శనివారం మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. జనగామ జిల్లా కొడకండ్ల మండలం రేగులతండాకు చెందిన గుగులోత్ శ్రీను(48) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అదే తండాకు చెందిన గుగులోత్ జయరాం 20 ఏళ్ల క్రితం బతుకు దెరువు కోసం వెళ్లి హనుమకొండలో రెడ్డికాలనీలో వాచ్‌మెన్ పని చేస్తున్నాడు. ఇటీవల ఆటో కొనుక్కొని హనుమకొండలో నడుపుతున్నాడు. కాగా.. రేగులతండాలో శ్రీను, జయరాం ఇళ్లు పక్కపక్కనే ఉంటాయి. జయరాం హనుమకొండలో ఉండడంతో తండాలోని ఆయన ఇంటి వెనకాల ఉన్న ఖాళీ స్థలంలో శ్రీను పశువులు కట్టేసుకునేవాడు. ఈవిషయంలో పలుమార్లు జయరాం తండాలో తగాదా పడ్డారు. తన స్థలంలో పశువులను కట్టేస్తున్న శ్రీనును ఎలాగైనా చంపాలని నిందితుడు అనుకున్నాడు. ప్రణాళిక ప్రకారం ఈనెల 20న తండాకు వచ్చిన జయరాం రాత్రి 10 గంటల సమయంలో శ్రీనుతో గొడవపడి వెంట తెచ్చుకున్న కత్తితో ఛాతిపై పలుమార్లు పొడిచాడు. శ్రీను తీవ్రగాయాలతో అరవడంతో కుటుంబ సభ్యులు రావడంతో నిందితుడు ఆటోలో పారిపోయాడు. శ్రీను రక్తపు మడుగులో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు వెంకన్న ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని ఆటో, హత్యకు వినియోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై హనుమకొండ, కొడకండ్ల పోలీస్‌స్టేషన్లలో గతంలో మూడు కేసులు నమోదయ్యాయి. ఈ కేసు చేధించిన కొడకండ్ల ఎస్సై రాజు, పోలీసులు రవీందర్‌రెడ్డి, వెంకటేష్, ఇమ్రాన్, రఘుపతి, అశోక్, అరుణ్, శ్రీకాంత్, సల్మాన్‌లను జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్ అభినందించారు.

OFFICE OF THE EXECUTIVE ENGINEER,
TGMSIDC DIVISION, WARANGAL
H.No. 2-11-324/1, Beside Govt. CD&TB Hospital, Hanamkonda-506 009.
Ph: 0870-2455769, Email Id: eetsmsidcwgl@gmail.com

TENDER NOTICE

No. 2/EE/TGMSIDC/WGL/2025-26/ Dated: 26-04-2025

Tender invited through e-procurement platform for the following works 1) Providing CC Flooring for Medical Camp & Painting to Compound Wall to PHC Kaleswaram 2) Balance work for Sub Centre at a) Laxmipuram (V) Keshavapur PHC, Duggondi (M) (Reserved for SC Category), b) Narakkapet (V) Medapally (M) (Reserved for ST Category), c) Mondrai (V) Sangem PHC, Sangem (M), d) Malampally (V) Duggondi PHC, Duggondi (M), e) Thimmampet (V) Duggondi PHC, Duggondi (M).
The other details can be seen at website https://tender.telangana.gov.in.

Sd/- Executive Engineer, TGMSIDC Division, Warangal

డిగ్రీ పరీక్షలు మళ్లీ వాయిదా..

- పరీక్ష ఫీజులు చెల్లించని ప్రైవేట్ కాలేజీలు
- మళ్లీ ఎప్పుడు అనేది వెల్లడించని కేయూ
- అయోమయంలో వివిధ సెమిస్టర్ల విద్యార్థులు



కేయూ క్యాంపస్‌: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లోని డిగ్రీ కళాశాలల్లోని 2, 4, 6 సెమిస్టర్ల పరీక్షలు, బ్యాక్‌లాగ్ మొదటి, మూడో, ఐదో సెమిస్టర్ల పరీక్షలు ఈనెల 28నుంచి నిర్వహిస్తామని చెప్పిన యూనివర్సిటీ అధికారులు శనివారం మళ్లీ వాయిదా వేశారు. ఈ మేరకు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య రాజేందర్ వెల్లడించారు. ఎక్కువ శాతం ప్రైవేట్ కాలేజీలు విద్యార్థులనుంచి పరీక్ష ఫీజులు వసూలు చేసినప్పటికీ పరీక్షల విభాగానికి చెల్లించలేదు. ఈ మధ్యకాలంలో ప్రభుత్వం తమకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వనందున పరీక్షల ఫీజులు సంబంధిత విభాగానికి చెల్లించలేదని ప్రైవేట్ డిగ్రీ కాలేజీల యాజమాన్యాలు స్పష్టం చేస్తున్నాయి. ఈనేపథ్యంలో పరీక్షలు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించినప్పటికీ తిరిగి ఎప్పుడు నిర్వహిస్తారనేది వెల్లడించకపోవడంతో విద్యార్థులు అయోమయంలో పడ్డారు.

ఫీజులు చెల్లించిన 153 కాలేజీలు

కేయూ పరిధిలో 292 ప్రభుత్వ, గురుకుల, ప్రైవేట్, అటానమస్ కాలేజీలు ఉన్నాయి. అందులో కేవలం 153 కాలేజీల విద్యార్థుల పరీక్షల ఫీజులు పరీక్షల విభాగానికి చెల్లించాయి. నామినల్ రోల్స్‌ను కూడా పరీక్షల విభాగానికి పంపించలేదు.

అయోమయంలో విద్యార్థులు..

సుమారు లక్షా 70 వేల మందికిపైగా విద్యార్థులు పరీక్షలు రాసేందుకు సిద్ధంగా ఉన్నారు. కానీ, సెమిస్టర్ల పరీక్షలు వాయిదా పడడం.. తర్వాత పరీక్షలు ఎప్పుడు నిర్వహిస్తారనే విషయంపై స్పష్టత లేకపోవడంతో విద్యార్థులు అయోమయంలో పడ్డారు. ముఖ్యంగా డిగ్రీకోర్సుల ఫైనల్ ఇయర్ విద్యార్థులకు నష్టం కలిగే అవకాశం ఉంది. వీరు పీజీ సెట్, ఎడ్ సెట్, లా సెట్, బీజే ఐసెట్ వంటి పరీక్షలు రాసే అవకాశాల్ని కోల్పోయే ప్రమాదం ఉంది. దీంతో తమకు పరీక్షలు నిర్వహించాలని కోరుతూ విద్యార్థులు సైతం రోడ్లపైకి వచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

'సుమతిరెడ్డి'లో సందడి


సావనీర్ విడుదల చేస్తున్న అతిథులు


విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు

● హోరెత్తిన ఎలిజియం బ్యాండ్ బృంద ప్రదర్శన
● ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

హసన్‌పర్తి: నగర శివారులోని సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థినులు సందడి చేశారు. కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహించిన శ్రీశుమ్–25 కార్యక్రమం శనివారం ముగిసింది. విద్యార్థినుల ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈసందర్భంగా హైదరాబాద్‌కు చెందిన ఎలిజియం బ్యాండ్ ప్రదర్శన హోరెత్తించింది. తొలుత నిర్వహించిన కార్యక్రమంలో ఎస్సార్ యూనివర్సిటీ చాన్స్‌లర్, ఎస్సార్ విద్యా సంస్థల ఛైర్మన్ వరదారెడ్డి మాట్లాడారు.. క్రమశిక్షణ పద్ధతులతో చదివితే ఉన్నతశిఖరాలు అధిరోహిస్తారని పేర్కొన్నారు. విద్యార్థినుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తులను వెలికితీయడానికే ఇలాంటి కార్యక్రమాలు దోహదపడుతాయన్నారు. అనంతరం సావనీర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎస్సార్ విద్యా సంస్థల సెక్రటరీ మధుకర్‌రెడ్డి, డైరెక్టర్ సాధనారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశ్రీరెడ్డి, ఏ.వేణుగోపాల్, అధ్యాపకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

ఇంజక్షన్ వికటించి వ్యక్తి మృతి

● బాధిత కుటుంబ సభ్యుల ఆందోళన


మల్లేష్ మృతదేహం

రాయపర్తి: ఆర్‌ఎంపీ వేసిన ఇంజక్షన్ వికటించి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని కొండూరు గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. బాధిత బంధువుల కథనం ప్రకారం.. వర్ధన్నపేట మండలకేంద్రానికి చెందిన ఓర్సు మల్లేష్(35) తన భార్యతోపాటు మరికొంత మందితో కొండూరు గ్రామంలో మట్టి తవ్వకానికి వచ్చాడు. ఈ క్రమంలో మల్లేష్‌కు ఒంట్లో నొప్పిగా ఉండగా కుటుంబ సభ్యులకు చెప్పాడు. ఈ క్రమంలో గ్రామంలోని పరమేశ్వర క్లినిక్ నిర్వహిస్తున్న ఆర్‌ఎంపీ వద్దకు వచ్చారు. ఆయన మల్లేష్‌కు ఇంజక్షన్ ఇచ్చాడు. ఆ తర్వాత కొంతసేపటికి మల్లేష్ మృతిచెందాడు. దీంతో ఆగ్రహానికి గురైన మృతుడి బంధువులు, కుటుంబ సభ్యులు మృతదేహాన్ని పరమేశ్వర క్లినిక్‌లో వేసి ఆందోళనకు దిగారు. దీంతో గ్రామంలో ఆందోళన నెలకొంది. ఆర్‌ఎంపీ పరారీలో ఉన్నాడు. విషయం తెలుసుకున్న వర్ధన్నపేట సీఐ శ్రీనివాసరావు, వర్ధన్నపేట ఎస్సై రాజు గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఇంటికి పెద్ద దిక్కును కోల్పోయిన ఆ కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. 12 మంది కూలీలకు గాయాలు

కమలాపూర్‌: కూలీ పనులకు వెళ్లిన కూలీలను తీసుకొస్తుండగా ప్రమాదవశాత్తు అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా పడిన ప్రమాదంలో 12 మందికి గాయాలయ్యాయి. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్ శివారులో శనివారం జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వంగపల్లికి చెందిన 19 మంది కూలీలు మిర్చి పంట ఏరివేసేందుకు వెళ్లి పనులు ముగించుకుని తిరిగి ట్రాక్టర్‌లో ఇంటికి వస్తున్నారు. ఈ క్రమంలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడడంతో అందులో ప్రయాణిస్తున్న 12 మందికి గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం కమలాపూర్‌లోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం 8 మందిని స్కానింగ్, మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి, ఒకరిని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వీరిలో ముగ్గురికి తీవ్ర గాయాలైనట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

బీజేపీ వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

● మే 20న దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మె
● కార్మిక సంఘాల జిల్లాస్థాయి సదస్సులో తీర్మానం


సదస్సులో అభివాదం చేస్తున్న వివిధ కార్మిక సంఘాల రాష్ట్ర బాధ్యులు

కేయూ క్యాంపస్‌: బీజేపీ వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని మే 20న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని రాష్ట్ర కార్మిక సంఘాల జిల్లాస్థాయి సదస్సులో తీర్మానించారు. కాకతీయ యూనివర్సిటీలోని కామర్స్ విభాగం సెమినార్‌హాల్‌లో శనివారం నిర్వహించిన ఈ సదస్సులో వివిధ కార్మిక సంఘాల నేతలు మాట్లాడారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ కూటమి కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను అనుసరిస్తుందని ఆరోపించారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తోందన్నారు. కార్మికులు సమరశీల పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. 29 కార్మిక చట్టాలను రద్దు చేసిందన్నారు. కార్మికుల హక్కులు, సంక్షేమాన్ని ఎన్డీఏ ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. కేంద్ర కార్మిక సంఘాలు స్వతంత్ర ఫెడరేషన్లు ఆహ్వానిస్తున్న మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలన్నారు. సదస్సులో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రేమ్‌పావని, బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు, ఐఎఫ్‌టీయూ రాష్ట్రకార్యదర్శి శ్రీనివాస్, ఏఐసీటీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎమ్మెస్‌రావు, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి, రాగుల రమేష్, టీయూసీఐ, కుసుమ శ్యాంసుందర్, మైబెల్లి, రాజేందర్, రవి, చక్రపాణి, అశోక్, సంపత్, రాజేశ్వరి, కల్పన పాల్గొన్నారు.


హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం చింతలపల్లిలో విద్యుత్ వెలుగుల్లో బీఆర్ఎస్ రజతోత్సవ సభాప్రాంగణం

పశువైద్యుల సేవలు అమూల్యమైనవి

● జగన్‌మోహన్ రావు


మాట్లాడుతున్న జగన్ మోహన్ రావు

హన్మకొండ: మూగజీవాలకు సేవలందిస్తున్న పశువైద్యుల సేవలు అమూల్యమైనవని, దేశ జీడీపీలో పశు వైద్య, పశుసంవర్ధక శాఖ పాత్ర ప్రముఖమైందని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్నమనేని జగన్‌మోహన్‌రావు అన్నారు. హనుమకొండ నక్కలగుట్టలోని వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఆడిటోరియంలో తెలంగాణ వెటర్నరీ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ పశు వైద్యదినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగన్ మోహన్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. పశు వైద్యవృత్తి చేసే వారికి సరైన గుర్తింపు ఇవ్వాల్సిందిగా డిమాండ్ చేస్తూ రీఆర్గనైజేషన్ చేయడానికి జేఏసీ డిమాండ్‌లో ఈ అంశాన్ని పొందుపరుస్తామని చెప్పారు. ఎంజీఎం సమీపంలోని వెటర్నరీ అసోసియేషన్ బిల్డింగ్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం వెంటర్నరీ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి డాక్టర్ రాము మాట్లాడారు. ఈ సందర్భంగా పదవి విరమణ పొందిన పశు వైద్యులను సన్మానించారు. కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి కిరణ్ కుమార్, హనుమకొండ జిల్లా అధికారి డాక్టర్ విజయభాస్కర్, ములుగు జిల్లా అధికారి డాక్టర్ కొమురయ్య, టీజీఓ అసోసియేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు డి.మురళీధర్ రెడ్డి, తెలంగాణ వెటర్నరీ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కోశాధికారి డాక్టర్ బాలోజీ, డాక్టర్ ప్రవీణ్ కుమార్, కృష్ణమూర్తి, ప్రకాశ్, శ్రీనివాస్, రవికుమార్, గోపాల్ రావు, వినయ్, రాజేష్, నరేష్, విజయ, నాగమణి, ఊర్మిళ, మాలతి పాల్గొన్నారు.

ప్రశాంత సమాజ స్థాపనకు కృషి చేయాలి


మాట్లాడుతున్న జడ్జి బి.అపర్ణ దేవి

నయీంనగర్: ప్రస్తుత సమాజంలో భార్యభర్తలు, తల్లిదండ్రులు పిల్లల మధ్య తగాదాలు పెరుగుతున్నాయని.. వీటికి కమ్యూనిటీ మధ్యవర్తిత్వం మెరుగైన పరిష్కారమని, ప్రశాంతమైన సమాజ స్థాపనకు పెద్దలు నడుం బిగించాలని ఫస్ట్ ఏడీజే జడ్జి బి.అపర్ణ దేవి అన్నారు. కమ్యూనిటీ మధ్యవర్తిత్వ వలంటీర్లుగా శిక్షణ పొందిన పరికిపండ్ల వేణు, తేరాల యుగంధర్, పాశం సంజీవరెడ్డి, తూడి విద్యాసాగర్ రెడ్డి, యాదగిరి 53వ డివిజన్ ఆదర్శకాలనీలో నిర్వహించనున్న ఆదర్శ కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్‌ను ఆమె శనివారం ప్రారంభించారు. అనంతరం జడ్జి అపర్ణ దేవి మాట్లాడుతూ సమాజంలోని వ్యక్తులు, సమూహాల మధ్య ఏర్పడే వివాదాలను కమ్యూనిటీ మధ్యవర్తిత్వం ద్వారా శాంతియుతంగా పరిష్కరించగలిగితే సత్ఫలితాలు ఉంటాయన్నారు. 2023 లో వచ్చిన మధ్యవర్తిత్వ చట్టం ఈ విధానానికి చట్టబద్ధత కల్పించిందన్నారు. కమ్యూనిటీ మధ్యవర్తిత్వ వలంటీర్లుగా శిక్షణ పొందిన పరికిపండ్ల వేణు, తేరాల యుగంధర్, పాశం సంజీవరెడ్డి, తూడి విద్యాసాగర్ రెడ్డి, యాదగిరి, హనుమకొండ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరి క్షమాదేశ్ పాండే, వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ సాయికుమార్, ఎస్ఐ సదానందం, దామెర నరసయ్య, దామోదర్, విద్యాసాగర్ రెడ్డి, నరసింహస్వామి పాల్గొన్నారు.

సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు చేయాలి

కేయూ క్యాంపస్: సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు చేయాలని కాకతీయ యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, మానవ వనరుల విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ చిన్నాల బలరాములు అన్నారు. ఆ విభాగంలో పరిశోధకులకు రీసెర్చ్ మెథడాలజీపై నిర్వహిస్తున్న తరగతుల్లో భాగంగా ఆయన శనివారం పాల్గొని మాట్లాడారు. క్షేత్రస్థాయిలో సామాజిక సమస్యలపై పరిశోధనలు చేసి సానుకూల పరిష్కార మార్గాలను అన్వేషించాలన్నారు. సమావేశంలో విభాగం అధిపతి ప్రొఫెసర్ పెదమళ్ల శ్రీనివాస్ రావు, బీఓఎస్ చైర్మన్ డాక్టర్ ఎ.శ్రీనివాసులు, అధ్యాపకులు చీకటి శ్రీను, బుర్రి ఉమాశంకర్, ఒడపెల్లి మోహన్, స్కాలర్స్ పాల్గొన్నారు.

నాడు పిడికిలెత్తి.. నేడు ఉరకలెత్తి

ఉద్యమ స్ఫూర్తితో ఓరుగల్లులో రజతోత్సవ సంబురం

- 'తెలంగాణ'కు ఊపిరిలూదిన ఓరుగల్లు
- కాకతీయుల గడ్డపై స్వరాష్ట్ర సాధన ఉద్యమం
- ఉద్యమ పార్టీగా ఆదరణ.. 25 ఏళ్లలో ఎన్నో ఒడిదుడుకులు
- తెలంగాణ సాధనలో వరంగల్‌దే కీలక భూమిక
- ఓరుగల్లులో బీఆర్ఎస్ ఉద్యమ ప్రస్థానం


ఉద్యమ కాలంలో వంటావార్పులో భాగంగా రోడ్డుపైనే భోజనాలు చేస్తున్న ఉద్యమకారులు, ప్రజలు(ఫైల్)

సాక్షిప్రతినిధి, వరంగల్: తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా ఆవిర్భవించిన బీ(టీ)ఆర్ఎస్ ఆధ్వర్యంలో పురుడుపోసుకున్న ఉద్యమం ఓరుగలుల్లో ఉవ్వెత్తున ఎగిసింది. పార్టీ ఆవిర్భావం నుంచి అండగా నిలుస్తున్న చారిత్రక ఓరుగల్లు.. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు ఉద్యమానికి ఊపిరులూదింది. వరంగల్ ఉద్యమ నేపథ్యం, స్ఫూర్తిని పదేపదే ప్రస్తావించే ఉద్యమనేత, మాజీ సీఎం కేసీఆర్.. 25 ఏళ్ల పార్టీ రజతోత్సవ సభకు ఇక్కడే వేదిక చేశారు. చారిత్రక వరంగల్ మరోసారి కీలక గులాబీ జెండా పండుగకు వేదికై ంది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఆవిర్భావం, ఓరుగల్లు పోరు, ఉద్యమ ప్రస్థానం, రాష్ట్రసాధన తదితర అంశాలు గుర్తుకు వస్తున్నాయి.

ఓరుగల్లులో ఇదీ పార్టీ ప్రస్థానం... వరుస సభలు.. రగిలిన ఉద్యమం..

హనుమకొండలోని కాకతీయ డిగ్రీ కళాశాల మైదానంలో మొదటి భారీ బహిరంగ సభ 2001 జూన్ 21న జరిగింది. విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని 2002 అక్టోబర్ 28న భూపాలపల్లిలో కేసీఆర్ బహిరంగ సభ నిర్వహించారు. 2003 ఏప్రిల్ 27న వరంగల్ జైత్రయాత్ర పేరిట భారీ బహిరంగ సభ నిర్వహించగా.. మాజీ ప్రధాన మంత్రి హెచ్‌డీ దేవగౌడ, అప్పటి కేంద్రం వ్యవసాయ శాఖ మంత్రి అజిత్‌సింగ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సభ సందర్భంగా ఒక్క రోజు ముందు సిద్దిపేట నుంచి వరంగల్ వరకు 100 కిలోమీటర్ల సైకిల్ ర్యాలీ నిర్వహించారు. 2003 అక్టోబర్ 22న మేడారంలో పల్లెబాట కార్యక్రమాన్ని కేసీఆర్ ప్రారంభించారు. 2003 డిసెంబర్ 5న జనగామలో ఓరుగల్లు వీరగర్జన బహిరంగ సభ నిర్వహించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో ఆరుగురు మంత్రులు రాజీనామా చేసిన తర్వాత 2005 జూలై 17 వరంగల్‌లో మొదటి సభ, భారీ బహిరంగ సభ నిర్వహించగా అప్పటి కేంద్ర మంత్రి శరద్‌పవార్ హాజరయ్యారు. 2007 ఏప్రిల్ 27 తెలంగాణ విశ్వరూప మహాసభ పేరుతో టీఆర్ఎస్ ఆరో వార్షికోత్సవం జరిగింది.

తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో

2009 నవంబర్ 23న కాకతీయ విశ్వవిద్యాలయంలో విద్యార్థుల జేఏసీ బహిరంగ సభ, 14 విద్యార్థి సంఘాలతో సమావేశం, స్వరాష్ట్రం కోసం 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో నినాదం' ప్రకటన చేశారు. 2010 సెప్టెంబర్ 3న పాలకుర్తి నియోజకవర్గం తొర్రూరులో టీఆర్ఎస్ బహిరంగ సభ జరిగింది. 2010 డిసెంబర్ 16న తెలంగాణ మహాగర్జన పేరుతో నగరంలోని ప్రకాశ్‌రెడ్డిపేటలో భారీ బహిరంగ సభ జరిగింది. ఈ సభకు ఆర్య సమాజ్ అధ్యక్షుడు స్వామి అగ్నివేశ్ ముఖ్య అతిథిగా హాజరు కాగా.. ఉద్యమ చరిత్రలోనే అతిపెద్ద బహిరంగ సభగా రికార్డు అయింది. 2014లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రకటన వెలువడగా.. 2017 ఏప్రిల్ 27న నగరంలోని ప్రకాశ్‌రెడ్డిపేటలో ప్రగతి నివేదన పేరుతో భారీ బహిరంగ సభ నిర్వహించారు. తాజాగా, బీఆర్ఎస్ 25 ఏళ్ల రజతోత్సవ సభ కూడా ఇక్కడే నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది.

ఎన్నికల సభలు, విజయోత్సవ సభలు.. పాతికేళ్లలో ఒడిదుడుకులు..

తెలంగాణ సాధన ఉద్యమ సభలతోపాటు ఎన్నికలు, విజయోత్సవ సభలకు ఓరుగల్లు వేదికై ంది. 2004 సాధారణ ఎన్నికల్లో వరంగల్, హనుమకొండ లోక్‌సభ స్థానాలతోపాటు హనుమకొండ, స్టేషన్ ఘన్‌పూర్, చేర్యాల, నర్సంపేట, పరకాల, చెన్నూరు అసెంబ్లీ స్థానాల్లో టీఆర్ఎస్ విజయం సాధించింది. ఈ సందర్భంగా కేసీఆర్ పలుచోట్ల సభలు నిర్వహించారు. 2008 జూన్ 1న ఉప ఎన్నికల ఫలితాలు వెలువడగా హనుమకొండ లోక్‌సభ, చేర్యాల స్థానాల్లో టీఆర్ఎస్ గెలిచింది. 2009 మార్చిలో జరిగిన గ్రాడ్యుయేట్స్ ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థి గెలవగా, 2010 ఫిబ్రవరి 7న వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఉపఎన్నిక ప్రచారంలో కేసీఆర్ పాల్గొనగా అభ్యర్థి గెలిచాడు. 2012లో స్టేషన్‌ఘన్‌పూర్ ఉపఎన్నిక ప్రచారంలో కేసీఆర్ పాల్గొనగా టీఆర్ఎస్ ఘన విజయం సాధించింది. 2014 సాధారణ ఎన్నికల్లో కేసీఆర్ ప్రచారం.. వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ.. వరంగల్ పశ్చిమ, వరంగల్ తూర్పు, స్టేషన్‌ఘన్‌పూర్, వర్ధన్నపేట, జనగామ, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి అసెంబ్లీ స్థానాల్లో టీ(బీ)ఆర్ఎస్ విజయం దక్కింది. 2015 మార్చిలో జరిగిన గ్రాడ్యుయేట్స్ ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలిచారు. 2015 నవంబర్ 24న వరంగల్ లోక్‌సభ ఉపఎన్నికలో టీఆర్ఎస్ అభ్యర్థి పసునూరి దయాకర్ 4,59,092 ఓట్ల రికార్డు మెజారిటీతో ఘన విజయం సాధించారు. 2015 డిసెంబర్‌లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, 2016 మార్చి 9న గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 58 డివిజన్లలో 44 స్థానాలను పార్టీ గెలుచుకుంది. 2018 డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాల్లోని 11 స్థానాల్లో గెలవగా, 2019 ఏప్రిల్‌లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని వరంగల్, మహబూబాబాద్ స్థానాల్లో విజయం సాధించారు. 2019 మేలో జరిగిన పరిషత్ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని ఆరు జెడ్పీలు, 98 శాతం ఎంపీపీలు గెలవగా, 2019 జూన్‌లో జరిగిన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఘనవిజయం సాధించారు. 2020 జనవరిలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని 9 మున్సిపాలిటీల్లో గెలవగా, 2021 మార్చిలో జరిగిన గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికలో టీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలిచారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో 12 స్థానాల్లో రెండే స్థానాలను బీఆర్ఎస్ గెలుచుకుంది.


వరంగల్ నగరంలో ఉద్యమకారులను అడ్డుకుంటున్న పోలీసులు(ఫైల్)

ఏ కార్యక్రమం మొదలుపెట్టినా ఇక్కడినుంచే..

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు వరంగల్ అంటే ప్రత్యేక అభిమానం. ఇక్కడినుంచి ఏ కార్యక్రమం మొదలుపెట్టినా అది సక్సెస్ అవుతుందన్న నమ్మకం ఆయనది. కాకతీయుల ఏలుబడి.. సమ్మక్క–సారక్కల పోరాట తెగువ.. కాళోజీ నారాయణ రావు, ఆచార్య జయశంకర్‌లను స్ఫూర్తిగా చెప్పుకుంటారు. కాకతీయ యూనివర్సిటీ విద్యార్థుల తెగువను తరచూ ప్రస్తావిస్తారు. తెలంగాణ రాష్ట్ర సాధన లక్ష్యంగా ఆవిర్భవించిన బీ(టీ)ఆర్ఎస్.. 14 ఏళ్ల ఉద్యమ సమయంలో పడుతూ లేస్తూ అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంది. పడినప్పుడల్లా లేచేందుకు పురుడుపోసుకున్న ఆలోచనలతో ఉద్యమం ఓరుగలుల్లో ఉవ్వెత్తున ఎగిసింది. ఉద్యమాలకు కేరాఫ్.. పోరాటాల ఖిల్లాగా ఉన్న చారిత్రక వరంగల్ జిల్లా బీఆర్ఎస్‌లో కీలక ఘట్టాలకు వేదికైంది. అందుకే పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టే ప్రతీ కార్యక్రమం ఓరుగల్లు నుంచే మొదలెట్టడం కేసీఆర్‌కు రివాజుగా మారింది. ఇదే క్రమంలో బీఆర్ఎస్ సిల్వర్‌జూబ్లీ వేడుకలకు మరోసారి ఓరుగల్లును వేదికగా మార్చుకున్నారన్న చర్చ ఉంది.


ఉద్యమ సమయంలో వరంగల్ నగరంలో వంటావార్పు (ఫైల్)

కాంగ్రెస్ ఇక ఖతమే!

- ప్రభుత్వ మోసాలు ప్రజలకు తెలిసిపోయినయ్..
- రజతోత్సవ సభకు భారీగా తరలిరావాలి
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత తన్నీరు హరీశ్‌రావు


సభాస్థలి, ఏర్పాట్లను పరిశీలిస్తున్న హరీశ్‌రావు, చిత్రంలో ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, వరంగల్: మోసాలు, తీర్చలేని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ పని ఇక ఖతమైనట్లే, ఈ ప్రభుత్వం వచ్చాక రాష్ట్ర ఆదాయం పడిపోయిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శనివారం ఎల్కతుర్తిలో రజతోత్సవ సభ ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏమీ చేయలేని ప్రభుత్వంపై ఏడాదిన్నర కాలంలోనే ప్రజలు మండిపడుతున్నారని, ఎప్పుడు ఎన్నికలు వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం, కేసీఆర్ సీఎం కావడం ఖాయమన్నారు. సరిపడ నీళ్లున్నా.. పంటలు ఎండిపోయాయని, రైతులను నిండాముంచిన ప్రభుత్వం కాంగ్రెస్ అని ధ్వజమెత్తారు. ఎల్కతుర్తిలో నిర్వహించే సిల్వర్ జూబ్లీ వేడుకలకు ఇప్పటికే చాలా జిల్లాల నుంచి పాదయాత్రగా బయలుదేరారని, కేసీఆర్‌ను చూడాలని, ఆయన మాటలు వినాలని రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ఉత్సాహంగా ఎదురు చూస్తున్నారన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలంటే తెలంగాణ ప్రజలకు పండుగలాంటిదన్నారు. 14 ఏళ్ల ఉద్యమంలో ఉన్నా.. పదేళ్ల పరిపాలనలో ఉన్నా.. ఏడాదిన్నరగా ప్రతిపక్షంలో ఉన్నా.. బీఆర్ఎస్ ఎప్పుడు ప్రజల పక్షమేనన్నారు. రాష్ట్రంలో మళ్లీ కేసీఆర్ రావాలి.. బీఆర్ఎస్ ప్రభుత్వం రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఎల్కతుర్తి కేంద్రంగా నిర్వహించే రైతుసభకు లక్షలాదిగా జనం తరలివస్తారని అంచనాలు తేలిపోతున్నాయని, కానీ ట్రాఫిక్ నియంత్రణ పేరిట ఈ ప్రభుత్వం, పోలీసులు ఆంక్షలు విధించే అవకాశం ఉందని, నాయకులు, కార్యకర్తలు స్వీయ నియంత్రణ చేపట్టి అధిక సంఖ్యలో సభకు తరలివచ్చేలా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఉమ్మడి వరంగల్ ఇన్‌చార్జ్ గ్యాదరి బాలమల్లు, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తక్కళ్లపెల్లి రవీందర్ రావు, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, పెద్ది సుదర్శన్ రెడ్డి, వొడితెల సతీష్‌కుమార్, నన్నపునేని నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభ చరిత్రాత్మకంగా నిలుస్తుంది

ఎల్కతుర్తి: రజతోత్సవసభ చరిత్రాత్మకంగా నిలుస్తుందని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. చింతలపల్లి సమీపంలో సభా ఏర్పాట్లను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎంగా కేసీఆర్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో దేశంలోనే ఆదర్శంగా నిలిపారని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణలో 10 జిల్లాలు ఉంటే 9 జిల్లాలు వెనుకబడి ఉన్నాయని అప్పటి కేంద్ర ప్రభుత్వం స్వయంగా చెప్పిందని గుర్తుచేశారు. అలాంటి రాష్ట్రాన్ని సీఎంగా కేసీఆర్ దేశంలో అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లో మూడో స్థానంలో నిలిపారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టి మోసపు హామీలతో అధికారంలోకి వచ్చిందన్నారు. నాయకులు పిట్టల మహేందర్, గొల్లె మహేందర్, తంగెడ మహేందర్, ఎల్తూరి స్వామి, వేముల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

అంతర్జాతీయ భారత్ సమ్మిట్‌లో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి


సమ్మిట్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలకుర్తి టౌన్: హైదరాబాద్ నోవ హోటల్‌లో శనివారం జరిగిన అంతర్జాతీయ భారత్ సమ్మిట్‌లో పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ సమాఖ్య అభివృద్ధిపై సమగ్ర భారత నిర్మాణంలో యువత పాత్రపై తన అభిప్రాయం వెల్లడించారు. పహల్గాం ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించిన ఎమ్మెల్యే.. దేశ భద్రతకు ముప్పు తలపెట్టే చర్యలను బలంగా నిరోధించాలన్నారు. దేశ విభజన కోరే శక్తులకు కఠినంగా తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన అమరులకు నివాళులర్పించారు.

లబ్ధిపొందాను.. నడిచే వెళ్తాను

- బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పాదయాత్రగా వెళ్తున్న వృద్ధుడు
- 75 ఏళ్ల వయస్సులో తన అభిమానాన్ని చాటుతున్న గంగ్యానాయక్


గంగ్యానాయక్‌ను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నెక్కొండ: మాజీ సీఎం కేసీఆర్ మీద ఉన్న అభిమానంతో బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఓ వృద్ధుడు చేపట్టిన పాదయాత్ర శనివారం వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రానికి చేరింది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం వెంకటగిరి గ్రామం చంద్రుతండాకు చెందిన 75 ఏళ్ల వృద్ధుడు భూక్య గంగ్యానాయక్ చేతితో కేసీఆర్ ఫ్లెక్సీ పట్టుకుని పాదయాత్ర చేపట్టాడు. భగభగ మండుతున్న ఎండను లెక్క చేయకుండా అభిమానంతో పాదయాత్రగా సభాస్థలికి వెళ్తున్నాడు. ఈసందర్భంగా గంగ్యానాయక్ మాట్లాడుతూ.. తన కుటుంబానికి రైతు బంధు, తన కుమారుడు మృతి చెందితే రైతు బీమా రూ.5 లక్షలు వచ్చాయన్నాడు. కేసీఆర్ ప్రభుత్వంలో తన కుటుంబానికి లబ్ధి చేకూరిందని.. అందువల్ల పాదయాత్రగా సభకు వెళ్తున్నట్లు చెప్పాడు. స్థానిక బీఆర్ఎస్ నాయకులు కొమ్ము రమేశ్‌యాదవ్, మారం రాము, సంగని సూరయ్య, కారింగుల సురేశ్, కొమ్మారెడ్డి రవీందర్ రెడ్డి, మహ్మద్ ఖలీల్, ఈదునూరి వెంకన్న తదితరులు గంగ్యానాయక్‌ను సన్మానించారు.


సభాప్రాంగణంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక మరుగుదొడ్లు


తాగునీటికోసం అందుబాటులో ఉంచిన డ్రమ్ములు


సభ లైవ్ ప్రసారం కోసం ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్


నినాదాలు చేస్తున్న మహిళలు


సిద్ధమైన హెలిపాడ్